సాక్షి
పెద్దపల్లి
గురువారం । 13 । ఏప్రిల్ । 2023



రాజన్న హుండీ లెక్కింపు
వేములవాడ: రాజన్న హుండీని బుధవారం లెక్కించారు. రూ.36.22లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో వివరించారు.



క్రమబద్ధీకరణ.. ఆస్తుల సంక్రమణ
అసైన్డ్ భూముల్లో నిర్మాణాలకు గుర్తింపు లభించింది. అంతర్గాంలో 40మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
41.2/23.0
వాతావరణం
ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత కొనసాగుతుంది. రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. గాలిలో తేమ ఉంటుంది.

కోపం, ఆవేశం వచ్చినప్పుడు మౌనంగా ఉండడం ఉత్తమం
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
గురు 6:36	శుక్ర 4:34

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

మద్దతు ధర కోసం రోడ్డెక్కిన పత్తి రైతులు



రైతులతో ఆందోళనకు దిగిన దాసరి ఉష

సుల్తానాబాద్(పెద్దపల్లి): పత్తికి మద్దతు ధర చెల్లించాలని రైతులు నిరసన చేపట్టారు. బుధవారం జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ వద్ద రోడ్డుపై ధర్నా చేశారు. వీరికి మద్దతుగా బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష నిలిచారు. రైతుల డిమాండ్లు నెరవేర్చే వరకు వెనక్కి తగ్గేది లేదని ఆమె స్పష్టం చేశారు. క్వింటాల్‌కు రూ.5,500 చెల్లించడం ఏంటని ప్రశ్నించారు. రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు భోజనాలు చేయకుండా పత్తి కొనుగోలు కోసం నిరీక్షించినా ఫలితం లేకపోవడంతో నిరసన చేపట్టినట్లు వివరించారు. రైతులు, బీఎస్పీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో భక్తుల పూజలు



స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో భక్తులు బుధవారం పూజలు చేశారు. భక్తులకు ఆరాధ్యదైవంగా ప్రసిద్ధిగాంచిన ఓదెలమల్లన్న దర్శనం కోసం ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల తోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పుణ్యస్నానాలను ఆచరించి దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కోడె మొక్కులు చెల్లించారు. మల్లికార్జునస్వామి, సీతరామచంద్రస్వామి, ఖండేల రాయుడు, నందీశ్వరులను దర్శనం చేసుకున్నారు. హుండీలో కానుకలు సమర్పించుకున్నారు. పూజారులతో తీర్థప్రసాదాలు తీసుకున్నారు. ఒగ్గు పూజారులతో స్వామివారికి పట్నాలు, బోనాలు చెల్లించారు. ఈవో బొడ్డు సదయ్య, చైర్మన్ మేకల మల్లేశంయాదవ్ భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అగ్నిప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



తనిఖీలు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జ్యోతినగర్: అగ్ని ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పెద్దపల్లి అగ్నిమాపక అధికారి దేవనంది శ్రీనివాస్ అన్నారు. జిల్లావ్యాప్తంగా అగ్ని ప్రమాదాల నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ, తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం పెద్దపల్లి అగ్నిమాపక స్టేషన్ పరిధిలో అగ్ని ప్రమాదాల నియంత్రణకు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. పట్టణంలోని ఓ ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించారు. అగ్ని ప్రమాదాల నియంత్రణకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అక్కడి సిబ్బందికి అవగాహన కల్పించారు. సిబ్బంది మహేందర్‌రెడ్డి, చంద్రయ్య, మనోహర్, శ్రీనివాస్ ఉన్నారు.

‘పది’ ఒకేషనల్ పరీక్షకు 681మంది హాజరు

జ్యోతినగర్: పదోతరగతి ఒకేషనల్ పరీక్షకు 681 మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎనిమిది పరీక్షాకేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 683 మంది విద్యార్థులకు గాను 681మంది విద్యార్థులు హాజరు అయ్యారని వివరించారు. 99.7 శాతం హాజరు నమోదు అయినట్లు తెలిపారు. మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు.

తాగునీటి గోస తప్పదా..!

- నిలకడ నీటితో పెరుగుతున్న కలుషితం
- పది రోజులుగా మురికి నీటి సరఫరా
- ఆందోళనలో కార్మిక కుటుంబాలు
- నిధులు మంజూరైనా తప్పని ఇబ్బందులు



ఫిల్టర్ బెడ్‌లో ఉన్న మురికి నీరు



ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, అధికారులు

గోదావరిఖని: ఎండాకాలంలో తాగునీటి వినియోగం ఎక్కువ. అయితే కార్మిక కుటుంబాలకు మాత్రం రంగుమారిన గోదావరి నీరే దిక్కవుతోంది. ఈ నీరు స్నానం చేసేందుకూ పనికిరావు. గతేడాది కూడా ఇదే నెలలో మురికి నీరు సరఫరా కావడంతో చాలా కార్మిక కుటుంబాలు డయేరియాతో ఆస్పత్రి పాలయ్యాయి. ప్రస్తుతం అదే పరిస్థితి మొదలైంది. సింగరేణి పారిశ్రామిక ప్రాంతమైన గోదావరిఖని, యైటింక్లయిన్‌కాలనీ, సెంటనరీకాలనీ కార్మిక కుటుంబాలకు గోదావరినది ఇంటెక్‌వెల్ నుంచి నల్లాల ద్వారా రోజూ 8.5 మిలియన్ గ్యాలన్ల నీరు సరఫరా అవుతోంది. సీఎస్సార్ కింద రూ.కోట్ల నిధులు ఇతర ప్రాంతాలకు అందిస్తున్నా కార్మికుల సంక్షేమాన్ని మర్చిపోతోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బొగ్గు ఉత్పత్తిలో కీలకపాత్ర పోషిస్తున్న కార్మికులకు మంచినీటిని అందించడంలో విఫలమవుతోందని అంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో గోదావరిలో నీటి ప్రవాహం నిలిచిపోయింది. దిగువన సుందిళ్ల బ్యారేజీ నిర్మాణంతో సుమారు పది కిలోమీటర్ల మేర నీరు నిల్వ ఉంది. పారిశ్రామిక వ్యర్థాలు, డ్రైనేజీ నీరు నేరుగా గోదావరిలో కలుస్తోంది. నదిలో నీటిప్రవాహం ఉంటే పెద్దగా సమస్య ఉండదు. నీరు నిల్వ ఉంటూ నీరు గరళంగా మారుతోంది. రంగుమారిన నీటితో కార్మిక కుటుంబాలు వాంతులు, విరేచనాలతో ఆసుపత్రి పాలవుతున్నారు. ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్ గోదావరి నది వద్ద ఉన్న ఇంటెక్‌వెల్, ఫిల్టర్‌బెడ్‌లను పరిశీలించి జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

నిధులు మంజూరైనా..

మిషన్ భగీరథ తరహాలో ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టరైజేషన్‌కు సింగరేణి డైరెక్టర్ల సమావేశంలో రూ.20కోట్లు కేటాయించింది. టెండర్ ఖరారు చేయాల్సి ఉంది. గతంలోనూ నిధులు కేటాయించినా ఇతర పనులకు మళ్లించింది. ఈసారి అలా కాకుండా సక్రమంగా వినియోగించాలని కోరుతున్నారు.

పట్టించుకోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు

కార్మిక కుటుంబాలకు కలుషిత నీరు సరఫరా అవుతున్నా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. గోదావరినదికి మూడు కిలోమీటర్ల దూరంలోనే పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయం ఉండటం, మున్సిపల్ డ్రైనేజీ నీరు, పారిశ్రామిక వ్యర్థాలు నదిలో కలుస్తున్నా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

మురికినీరు సరఫరా

సింగరేణి కార్మికవాడలకు బుధవారం కూడా నల్లాల ద్వారా మురికినీరు సరఫరా కావడంతో కార్మిక కుటుంబాలు ఆందోళనకు గురయ్యాయి. ఆర్జీ–1 ఏరియా పరిధిలోని గోదావరిఖని, ఆర్జీ–2 ఏరియా పరిధిలోని యైటింక్లయిన్‌కాలనీ, మహాకవి పోతనకాలనీ, ఆర్జీ–3 ఏరియా పరిధిలోని సెంటినరీకాలనీ ప్రాంతాలకు చెందిన కార్మికవాడలకు నిత్యం సరఫరా చేసే గోదావరినీరు రంగుమారింది. దీంతో నల్లాల ద్వారా సరఫరా అయ్యే నీరు రంగు మారి రావడంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కార్మికవాడలకు సరఫరా అవుతున్న మురికినీరు

ఫిల్టర్లు చెడిపోతున్నాయి



వారంరోజులుగా మురికి నీరు వస్తోంది. ఫిల్టర్ల క్యాట్రిడ్జిలు పాడవుతున్నాయి. తాగడానికి కాదు.. స్నానానికీ ఇబ్బంది పడుతున్నాం. యాజమాన్యం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. మున్సిపల్ నీరు బాగానే ఉంటున్నా.. సింగరేణి నీటికి ఏమైందో తెలవడం లేదు.
– కర్క సుజాత, తిలక్‌నగర్

బట్టలు ఉతికేందుకూ ఇబ్బందే..



మురికి నీటితో ఇబ్బంది పడుతున్నాం. బట్టలు ఉతికితే ఎర్రగా అవుతున్నాయి. సింగరేణి అధికారులు పట్టించుకోవడం లేదు. వారం రోజులుగా ఇదే పరిస్థితి. ఎండాకాలం మురికి నీటితో రోగాల పాలయ్యేలా ఉన్నాం.
– బండారి సరిత, యైటింక్లయిన్‌కాలనీ

ఇంకెన్ని రోజులో..?



వారంరోజులుగా ఇబ్బంది పడుతున్నాం. ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదు. ఎండాకాలంలో నీరు ఇలా వస్తే ఎలా..? తాగేందుకు ఏమాత్రమూ పనికిరావడం లేదు. మంచినీటిని కొనుక్కోవాల్సి వస్తోంది.
– నాగెల్లి స్వరూపరాణి, సెంటినరీకాలనీ

మూడు రోజుల్లోగా పరిష్కారం



నల్లాల ద్వారా మురికినీరు వస్తున్నది నిజమే. ఇంటెక్‌వెల్, ఫిల్టర్‌బెడ్ పరిశీలించాం. కొన్ని ఇబ్బందులున్నట్లు గుర్తించాం. సమస్యలను అధిగమించి మూడు రోజుల్లో శుద్ధి చేసిన నీటిని అందిస్తాం. ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టరైజేషన్ కోసం రూ.20కోట్లు కేటాయించారు. ఏడాదిలోగా పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు జరుగుతున్నాయి.
– చింతల శ్రీనివాస్, ఆర్జీ–1 జీఎం

ఎన్టీపీసీ కృషి అభినందనీయం

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



కుట్టుమిషన్లు అందిస్తున్న ఎమ్మెల్యే, ఈడీ

జ్యోతినగర్: మహిళల సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, మహిళా సాధికారతకు ఎన్టీపీసీ రామగుండం సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ఉద్యోగ వికాస కేంద్రం ఆడిటోరియంలో ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంతాలకు సంబంధించిన ఏడు డివిజన్లకు చెందిన 120మంది మహిళలకు ఎన్టీపీసీ సీఎస్సార్ సహకారంతో కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్, మేయర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే చందర్ మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కుట్టుమిషన్లు ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. విజయమ్మ ఫౌండేషన్ ద్వారా మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ అందిస్తున్నామని తెలిపారు. మహిళలు ఉన్నతంగా ఆలోచన చేసినప్పుడే ఆ కుటుంబం ఉన్నత స్థాయికి చేరుకుంటుందని వివరించారు. ఎన్టీపీసీ సంస్థ ప్రభావిత ప్రాంతాలకు అధిక నిధులను కేటాయించి అభివృద్ధి చేయాలని, రానున్న రోజుల్లో మరిన్ని సామాజిక కార్యక్రమాలను నిర్వహించాలని ఎన్టీపీసీ రామగుండం అధికారులను కోరారు. కార్యక్రమంలో సీజీఎం ప్రసేంజిత్ పాల్, ఏజీఎం(హెచ్ఆర్)బిజయ్‌కుమార్ సిగ్దర్, కార్పొరేటర్లు ఎన్వీ రమణారెడ్డి, కుమ్మరి శ్రీనివాస్, కల్వచర్ల కృష్ణవేణి, జెట్టి జ్యోతితో పాటు విజయమ్మ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ ఎడెల్లి శ్యాం, కుమ్మరి శారద పాల్గొన్నారు.

సంస్కృతికి, సాహిత్యానికి సంపద మన కవులు



కవులను సన్మానిస్తున్న రఘువీర్ సింగ్

జ్యోతినగర్: మన సంస్కృతికి, సాహిత్యానికి కవులు సంపద అని, వారిని గౌరవించడం మన సాంప్రదాయమని జిల్లా గ్రంథాలయ సంస్థచైర్మన్ రఘువీర్ సింగ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో డాక్టర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కవి సమ్మేళనంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కవులు ఏలేశ్వరం వెంకటేశ్, రాజేశం,తిరుపతి, మల్లన్న, తూం నర్సయ్య, మ్యాజిక్ రాజా, తదితరులను సన్మానించారు.

దివ్యాంగుల ఉపకరణాలకు దరఖాస్తుల ఆహ్వానం

జ్యోతినగర్: దివ్యాంగుల ఉపకరణాల కోసం ఈనెల 25లోగా ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి రాఫ్‌ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని దివ్యాంగుల సౌకర్యార్థం సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునీకరించిన ఉపకరణాలతో పాటు, సాంప్రదాయకమైన ఉపకరణాలను రాష్ట్ర ప్రభుత్వం వందశాతం సబ్సిడీతో అర్హులైన దివ్యాంగులకు 2023–24 సంవత్సరానికి ఉచితంగా పంపిణీ చేసేందుకు నిర్ణయించిందని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్నవారిని ఎంపిక చేసి ఉచితంగా అందిస్తామని తెలిపారు.

అందించే పరికరాలు..

జిల్లాలో 12 రెట్రో ఫిట్టెడ్ మోటార్ వెహికల్స్, 9 బ్యాటరీ వీల్ చైర్స్, 6 ల్యాప్ టాప్స్,15 స్మార్ట్ ఫోన్ , 1 డైసి ప్లేయర్, 22 ట్రైసైకిల్స్, 3 వీల్‌చైర్, 42 చంకకర్రలు, 15 వినికిడి యంత్రాలు, 17 అంధుల చేతికర్రలు, 4 అంధుల స్మార్ట్ కెన్ డివైసెస్, 9 టీఎల్ఎం కిట్ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

దరఖాస్తు చేసుకునేందుకు అర్హతలు

దరఖాస్తు చేసుకునే వారి ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాలో లక్షా యాభై వేలు,పట్టణ ప్రాంతాల్లో రెండు లక్షలు ఉండాలని,ఆదాయ సర్టిఫికెట్ జతచేయాలని, గతంలో దరఖాస్తు చేసుకున్న వారు రాకుంటే.. ఇప్పుడు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 25 చివరి తేదీ అని, దరఖాస్తును జిల్లా సంక్షేమఅధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లకు పటిష్ట చర్యలు

- 300 కొనుగోలు కేంద్రాలు
- 3.68 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- ఈనెల 20లోపు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి
- సమీక్షలో కలెక్టర్ సంగీత



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సంగీత

జ్యోతినగర్(రామగుండం): యాసంగి ధాన్యం కొనుగోళ్లకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంగీత ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ వి.లక్ష్మీనారాయణతో కలిసి సమీక్షించారు. యాసంగిలో దాదాపు 2.05 లక్షలు ఎకరాల్లో వరిసాగు జరిగిందని, 15వేల ఎకరాల పంట విత్తనం కోసం వాడతారని, మార్కెట్‌కు దాదాపు 3.68 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయ అధికారి జిల్లా కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 3.68 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించే విధంగా ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. ప్రతీ రైసు మిల్లుకు సమాంతరంగా కేటాయింపులు జరగాలని ఆదేశించారు. ఈనెల రెండోవారం నుంచి వరికోతలు ప్రారంభమవుతాయని, అందుకు అనుగుణంగా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ముందుగా ధాన్యం వచ్చే ఐదు మండలాల పరిధిలో ఈనెల 20వ తేదీ నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలన్నారు. ధాన్యం కొనుగోలుకు కోటి 6లక్షల గన్నీబ్యాగులు అవసరమవుతాయని, ప్రస్తుతం 56లక్షల నూతన గన్నీ బ్యాగులు, రైస్ మిల్లర్ల వద్ద 8లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. టార్పాలిన్లు, వేయింగ్ మిషన్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఆర్డీవోలు వెంకటమాధవరావు, కే.వీరబ్రహ్మచారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీధర్, జిల్లా పౌర సరఫరాల అధికారి తోట వెంకటేశ్, జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, సహకార అధికారి మైకెల్ బోస్ ఉన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా

జిల్లాలో ఓటరుజాబితాను పకడ్బందీగా తయారు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ సంగీత స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్, సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి టి.రవికిరణ్‌తో వీసీలో మాట్లాడారు. జిల్లాలో ఉన్న ఫొటో సిమిలర్ ఎంట్రీలను ఆర్డీవోలు, తహసీల్దార్లు ప్రత్యేకంగా పరిశీలించాలని, అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. ఓటరు జాబితా నుంచి తొలగించిన పేర్ల వివరాలు మరోసారి పరిశీలించి ఎన్నికల కమిషన్ నిబంధనల మేర డాక్యుమెంట్లు సంతకాలు ఉన్నాయో లేవో తనిఖీ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆర్డీవోలు వెంకట మాధవరావు, వీరబ్రహ్మ చారి, తదితరులున్నారు.

వ్యర్థం శుద్ధి.. ఎరువుల వృద్ధి!

- జిల్లాలో తొలిసారిగా ఎఫ్ఎస్‌టీపీ
- మానవ వ్యర్థాలతో ఎరువుల తయారీ
- రామగుండంలో రూ.3కోట్ల వ్యయంతో నిర్మాణం
- సిద్ధమవుతున్న మానవ వ్యర్థాల శుద్ధి కేంద్రం



రామగుండం బల్దియా పరిధిలోని ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్



ప్లాంటులో శుద్ధికేంద్రం ఇదే..

కోల్‌సిటీ(రామగుండం): మనిషి మల వ్యర్థాలతో ఎరువులు తయారుచేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్(ఎఫ్ఎస్‌టీపీ)లను ఏర్పాటు చేస్తోంది. ఈ వ్యర్థాలతో ఎరువులను తయారు చేసి రైతులకు చౌక ధరలకు అందించి, పంట ఉత్పత్తులను పెంచేందుకు పూనుకోవాలని రాష్ట్రంలోని అన్ని నగరపాలక, పురపాలకసంస్థల్లో ఎఫ్ఎస్‌టీపీల నిర్మాణాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నిండిన సెప్టిక్ ట్యాంకుల్లోని వ్యర్థాలతో ఎరువుల తయారీ ఈ శుద్ధి ప్లాంటు లక్ష్యం. రామగుండం నగర పాలక సంస్థలో కూడా సుమారు రూ.3కోట్ల వ్యయంతో ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్‌ను నిర్మిస్తున్నారు. ఈ ప్లాంట్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ ఎఫ్ఎస్‌టీపీ ఉపయోగంలోకి వస్తే రామగుండం నగరం ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ గుర్తింపు పొందడం తోపాటు స్వచ్ఛ సర్వేక్షన్‌లో మెరుగైన ర్యాంక్ సాధిస్తుందని.. ఈ వినూత్న ప్రయోగానికి పాలకవర్గం, అధికారులు ముందుకు అడుగులు వేస్తున్నారు.

రూ.3కోట్ల నిధులతో ప్లాంట్...

మల్కాపూర్ శివారులో ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎఫ్ఎస్‌టీపీ) నిర్మిస్తున్నారు. సుమారు రూ.3కోట్ల వ్యయంతో ఈ ప్లాంట్‌ను హైదరాబాద్‌కు చెందిన వీజీఎంఎంఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్మిస్తోంది. 60 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్ నిర్మాణం కోసం 1.23 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ప్రస్తుతం బల్దియాలో సెప్టిక్ ట్యాంకులు (మరుగుదొడ్లు) నిండగానే ప్రత్యేక వాహనాల ద్వారా మల వ్యర్థాలను సేకరించి వివిధ ప్రాంతాల్లో పారబోస్తున్నారు. మల వ్యర్థాన్ని కూడా అర్థవంతంగా మార్చాలని ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.


ఆహ్లాదం కలిగేలా సుందరీకరణ

ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ప్లాంట్ ఆవరణలో మనసుకు ఆహ్లాదం కలిగించేలా పూర్తి పర్యావరణ హితంగా ఈ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. సిట్రస్ గార్డెనింగ్ పేరిట ఉద్యానవనాన్ని అభివృద్ధి చేస్తున్నారు. మానవ వ్యర్థాలను శుద్ధి చేసిన తర్వాత బయటకు వచ్చిన నీటిని ప్లాంట్ ఆవరణలోని మొక్కలకు, ఘన వ్యర్థాన్ని వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడే ఎరువుగా మార్చేలా ప్లాంట్‌ను నిర్మిస్తున్నారు. పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల్లో కూడా ఎఫ్ఎస్‌టీపీల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఉన్నప్పటికీ, ఈ ప్రక్రియ డీపీఆర్ తయారు చేసే ప్రతిపాదనల దగ్గరే ఆగిపోయింది.

ట్రయల్‌రన్‌కు కసరత్తులు...

ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్‌ను ప్రారంభించడానికి అధికారులు ముందుస్తుగా ప్లాంట్‌లో ట్రయల్‌రన్ నిర్వహణకు కసరత్తులు చేస్తున్నారు. నగరంలోని సెప్టిక్ ట్యాంక్ ద్వారా ప్లాంట్‌కు మల వ్యర్థాలను వాహనాల్లో తరలించే పద్ధతి, వాటి బరువును నమోదు, ప్లాంట్ నుంచి ఎరువు తయారీ విధానం తదితర వాటిపై అధికారులు ట్రయల్‌రన్ నిర్వహించడానికి చర్యలు చేపడుతున్నారు.

ఎఫ్ఎస్‌టీపీతో మెరుగైన ర్యాంక్



ఎఫ్ఎస్‌టీపీ త్వరలోనే వినియోగంలోకి వస్తుంది. దీంతో చెరువులు, కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడం తగ్గిపోతుంది. ఎఫ్ఎస్‌టీపీలపై సెప్టిక్ ట్యాంక్ క్లీనర్లు, డీ స్లడ్జింగ్ ఆపరేటర్లకు అవగాహన కల్పించాం. వారికి లైసెన్స్‌లు జారీ చేస్తున్నాం. ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్ ద్వారా కంపోస్ట్ తయారు చేసి, మొక్కలకు ఎరువుగా ఉపయోగించుకోవడానికి ప్రణాళిక సిద్ధం చేశాం. ఎఫ్ఎస్‌టీపీతో రామగుండం నగరానికి ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ గుర్తింపు, స్వచ్ఛ సర్వేక్షన్‌లో మెరుగైన ర్యాంక్ కూడా సాధిస్తుంది.
– బి.అనిల్‌కుమార్, నగర మేయర్

ట్రయల్‌రన్ చేపడుతాం



ప్లాంట్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలోనే ట్రయల్‌రన్ చేపడుతాం. ఎరువు తయారు చేయడానికి రామగుండం నగరపాలక సంస్థతోపాటు సమీపంలోని ప్రాంతాలు, మున్సిపాలిటీల నుంచి కూడా మానవ మల వ్యర్థాలను వాహనాల ద్వారా ఎఫ్ఎస్‌టీపీకి తరలిస్తాం. త్వరలో ప్రభుత్వం గైడ్‌లైన్స్ వస్తాయి.
– బి.సుమన్‌రావు, నగర మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

కర్నాటక దేవదుర్గ్ ఎన్నికల ఇన్‌చార్జిగా ఎస్.కుమార్


ఎస్.కుమార్

గోదావరిఖని(రామగుండం): కర్నాటక రాష్ట్రంలోని దేవదుర్గ్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జిగా బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్‌ను నియమించారు. రాష్ట్రానికి చెందిన 20 మంది బీజేపీ నాయకులకు పలు నియోజకవర్గాల బాధ్యతలు అప్పగించారు. నియోజవర్గ కార్యక్రమాలు సమన్వయం చేసుకుంటూనే దేవదుర్గ్‌లో పూర్తి ఇన్‌చార్జిగా వ్యవహరించాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సూచించారు.

వ్యాసరచన పోటీలు

రామగిరి(మంథని): సింగరేణి సంస్థ ఆర్జీ–3, ఏపీఏ ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని సెంటినరీకాలనీలోని వివిధ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు దేశానికి, సమాజానికి అంబేడ్కర్ అందించిన సేవలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 14న నిర్వహించనున్న అంబేడ్కర్ జయంతి వేడుకల్లో బహుమతులు అందజేయనున్నారు.

విజేతలు వీరే..

కృష్ణవేణి టాలెంట్ స్కూల్ నుంచి అమూల్య, అక్షయ, రేవర్షిణి, వాణీ సెకండరీ స్కూల్ నుంచి జశ్వంత్, సాత్విక్, శ్రీవర్ష, హిల్‌పోర్ట్ హైస్కూల్ నుంచి శ్రీవల్లి, చరణ్‌రాజ్, విక్రమ్ తేజ, ప్రగతి హైస్కూల్ నుంచి అఖిల, రామ్ చరణ్, అఖిల ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.

సీఐటీయూ సంఘీభావ నిధి సేకరణ

జ్యోతినగర్(రామగుండం): రాష్ట్రవ్యాప్త సామాజిక వారోత్సవాల సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సంఘీభావ నిధి సేకరించారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ రోడ్‌లో సీఐటీయూ అనుబంధ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.2,371లను కార్మికుల వద్ద నుంచి సేకరించి, జిల్లా కమిటీ ద్వారా రాష్ట్ర కమిటీకి పంపించినట్లు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గీట్ల లక్ష్మారెడ్డి, నాంసాని శంకర్‌లు తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

సుల్తానాబాద్ రూరల్(పెద్దపల్లి): తాటిచెట్టు పైనుంచి పడి, ఓ గీత కార్మికుడికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. సుల్తానాబాద్‌రూరల్ మండలంలోని నారాయణరావుపల్లికి చెందిన ఇల్లందుల సంపత్ రోజూ మాదిరిగా బుధవారం తాటి చెట్టు ఎక్కుతుండగా జారి పడ్డాడు. ఈ ఘటనలో అతనికి గాయాలవగా సర్పంచ్ మొలుగూరి వెంకటలక్ష్మి, వార్డు సభ్యులు గుర్రం మల్లేశం, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మొలుగూరి ప్రశాంత్, నాయకులు అంజయ్యగౌడ్, సాయినాథ్‌లు కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

క్రమబద్ధీకరణ.. ఆస్తుల సంక్రమణ

- అసైన్డ్ భూముల్లో నిర్మాణాలకు గుర్తింపు
- రిజిస్ట్రేషన్‌తో లబ్ధిదారుల ఇళ్లకు చట్టబద్ధత
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై హర్షం
- అంతర్గాం మండలంలో 40 మంది ఎంపిక


లబ్ధిదారులకు డాక్యుమెంట్లు అందిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

రామగుండం: ఆ నిరుపేదలు దశాబ్దాల క్రితం ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు.. సదరు గ్రామ పంచాయతీ రికార్డుల్లో ఇంటి నంబర్ ఉంది. పన్నుల చెల్లింపులు చేస్తున్నారు.. అయినప్పటికీ సదరు గృహాలకు చట్టబద్ధత లేకపోవడంతో బాధితులు ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 58, 59, తేదీ:30–12–2014లో పేర్కొన్న విధంగా అసైన్డ్ భూముల్లో ఉన్న నిర్మాణాలతో పంచాయతీలకు లబ్ధి చేకూరుతున్న వాటిని గుర్తించి, క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. దీంతో లబ్ధిదారుల పేరిట ఆస్తుల సంక్రమణ(హక్కుల బదిలీ) జరుగుతోంది. ఫలితంగా ఆ ఇళ్లకు బ్యాంకు ద్వారా రుణం పొందే, క్రయ, విక్రయాలు జరుపుకునే అవకాశం కలిగింది. దీంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తుకు ఇవి జత చేయాలి..

ఆస్తుల క్రమబద్ధీకరణకు లబ్ధిదారులు తమ ఆధార్ కార్డు, గుర్తింపు రుజువు, ఆస్తి పన్ను, విద్యుత్ బిల్లు, నీటి బిల్లు రసీదులు, మరే ఇతర డాక్యుమెంట్లు ఉన్నా సంబంధిత దరఖాస్తుకు జత చేయాలి. వీటిపై తహసీల్దార్ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, లబ్ధిదారులుగా గుర్తించిన మీదట రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు అనుమతిస్తారు.

15 మంది ఆస్తుల క్రమబద్ధీకరణ

అంతర్గాం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు జీవో నంబర్ 58లో 14 మంది, 59లో 26 మందిని ఎంపిక చేశారు. వీరిలో ఇప్పటివరకు 15 మంది తమ ఆస్తుల క్రమబద్ధీకరణలో భాగంగా రిజిస్ట్రేషన్ చేయించుకొని, హక్కులు బదిలీ చేసుకున్నారు.

రిజిస్ట్రేషన్ చేయించుకున్నం



మా తాతల కాలం నుంచి ఇక్కడే బతుకుతున్నం. ఇంటి పన్ను చెల్లిస్తున్నా మాది కాదనే విషయం గుర్తుకు వస్తే బాధ కలిగేది. ప్రభుత్వ నిర్ణయంతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నం. ఇప్పుడు ఆస్తి మాదైంది.

– బదావత్ రాజునాయక్, లబ్ధిదారు, బ్రాహ్మణపల్లి తండా

ఆర్థిక భరోసా కలిగింది



ఇన్నేళ్లు సొంతింటిలో నివసిస్తున్నప్పటికీ అసైన్డ్ భూమిలో ఉండటంతో మాకు ఎలాంటి హక్కు ఉండేది కాదు. రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతో ఆర్థిక భరోసా కలిగింది. మార్కెట్‌లో మా ఇంటికి విలువ ఉంటది.

– బదావత్ విజయ, లబ్ధిదారు, బ్రాహ్మణపల్లి తండా


ఇల్లుందని గర్వంగా చెప్పకుంటం



ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్నప్పటికీ ఎలాంటి హక్కు లేకపోవడంతో మా ఇంటిని అభివృద్ధి చేసుకోలేకపోయినం. ఇప్పుడు అధికారికంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నం. మాకూ ఇల్లుందని గర్వంగా చెప్పుకుంటం.

– ఇస్లావత్ శాంత, లబ్ధిదారు, బ్రాహ్మణపల్లి తండా

సొంతింటి కళ సాకారమైంది



మేము 50 ఏళ్లుగా అసైన్డ్ భూమిలో సొంతంగా నిర్మించుకున్న ఇంట్లో ఉంటున్నం. ఏ క్షణంలోనైనా అధికారులు ఖాళీ చేయమంటరని భయపడేవాళ్లం. క్రమబద్ధీకరణతో సొంతింటి కళ సాకారమైంది.

– మహమ్మద్ అబ్దుల్ హకీక్, లబ్ధిదారు, టీటీఎస్ అంతర్గాం

రిజిస్ట్రేషన్‌కు ప్రోత్సహిస్తున్నాం..



ఇప్పటికే సగం మంది లబ్ధిదారులు తమ ఆస్తులను క్రమబద్ధీకరించుకున్నారు. మిగతా వారిని త్వరగా రిజిస్ట్రేషన్ చేయించుకునేలా ప్రోత్సహిస్తున్నాం. అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు చేసుకున్న వారికి ఇదో వరం.

– కత్రోజు వేణుగోపాల్, తహసీల్దార్, అంతర్గాం

అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించాలి

- ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్


మాట్లాడుతున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. జయంతి వేడుకలకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఏరియా ఇంజినీర్ నరసింహారావు, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు బదావత్ శంకర్‌నాయక్, బొక్కల శ్రీనివాస్, జె.శ్రీనివాస్, ఎల్.తిరుపతి, సీహెచ్.దుర్గాప్రసాద్, ఎ.చంద్రమౌళి, ఇ.కిష్టయ్య, బాల అంకూస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ న్యూఇయర్ క్యాలెండర్‌ను ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ బుధవారం ఆవిష్కరించారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్జీ–1 ఉపాధ్యక్షులు ఈర్ల రాజేశ్, నాయకులు నాగేశ్వరరావు, దొంత వెంకటేశ్వర్లు, కల్వల శంకర్, గడ్డం శంకర్, మిట్టపల్లి కుమార్, మాతంగి రాయమల్లు, జనగాం మల్లేశ్ పాల్గొన్నారు.

లంచం కేసులో ఉద్యోగికి నాలుగేళ్ల జైలు

- నేరస్తుడు గతంలో వీఆర్వో..
- ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్

కరీంనగర్ క్రైం/సుల్తానాబాద్(పెద్దపల్లి): పేరు మార్పిడి కోసం రైతు వద్ద లంచం తీసుకుంటూ పట్టుబడిన కేసులో గతంలో వీఆర్వో, ప్రస్తుత జూనియర్ అసిస్టెంట్‌కు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రత్యేక ఏసీబీ కోర్టు న్యాయమూర్తి లక్ష్మీకుమారి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌కు చెందిన పెండ్యాల మహిపాల్ రెడ్డి అదే గ్రామానికి చెందిన ఇద్దరి వద్ద కొంత భూమిని కొనుగోలు చేశాడు. దాన్ని తనతోపాటు భార్య పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. పేరు మార్పిడి కోసం తిమ్మాపూర్–1 వీఆర్వో నమిలికొండ వెంకటరమణకు సంబంధిత పత్రాలను ఇచ్చాడు. ఆయన ఎలాంటి పని చేయలేదు. తర్వాత అలుగునూరుకు బదిలీ అయ్యాడు. పత్రాలు వీఆర్వో వద్ద ఉండటంతో మహిపాల్ రెడ్డి వెళ్లి అడగగా రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు 2013 ఏప్రిల్ 4న కరీంనగర్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అదే నెల 6న ఉదయం వీఆర్వో వెంకటరమణ తన ఆఫీసులో మహిపాల్ రెడ్డి వద్ద లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అప్పటి సీఐ వీరభద్రం కేసు దర్యాప్తు జరిపారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి లక్ష్మీకుమారి వెంకటరమణకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. వెంకటరమణ ప్రస్తుతం పెద్దపల్లి డీపీవో ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల చర్చలు వాయిదా


చర్చల్లో పాల్గొన్న జేఏసీ నాయకులు, యాజమాన్యం, కాంట్రాక్టర్లు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందం అమలుపై జరిగిన చర్చలు వాయిదా పడ్డాయి. బుధవారం ప్రాజెక్టులోని ఆడిటోరియంలో యాజమాన్యం, జేఏసీ నాయకులు, కాంట్రాక్టర్లు హాజరై, 2018 ఒప్పందంలోని పెండింగ్ అంశాలతోపాటు కొత్త వేతన ఒప్పందంపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనంతోపాటు రూ.23 వేలు చెల్లించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేయగా యాజమాన్యం, కాంట్రాక్టర్లు మాత్రం ప్రస్తుత వేతనంపై 3 శాతం అదనంగా చెల్లిస్తామని చెప్పారు. దీంతో చర్చలు వాయిదా పడ్డాయి. మళ్లీ ఈ నెల 26న హైదరాబాద్‌లోని ఆర్ఎల్‌సీ సమక్షంలో జరగనున్నట్లు నాయకులు తెలిపారు. ఎన్టీపీసీ అధికారులు ఏజీఎం బిజయ్‌కుమార్ సిగ్దర్, శామ్యూల్ ప్రశాంత్, దీపక్ పాఠక్, జేఏసీ నాయకులు కౌశిక హరి, చిలుక శంకర్, నాంసాని శంకర్, శ్రీనివాస్, సత్యం, శంకర్, జమీల్, భూమయ్య, కాంట్రాక్టర్లు శ్రీనివాస్, ఏబీసీ రెడ్డి, నారాయణ, సోమిరెడ్డి, రామాచారి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జేఏసీ నాయకుల సమావేశం

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు చర్చలకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు గురువారం సమావేశం కానున్నారు. ఆయా అంశాలపై ఈ నెల 26న హైదరాబాద్‌లోని ఆర్ఎల్‌సీ సమక్షంలో జరగనున్న సమావేశంలో విన్నవించేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిసింది.

రైలు పట్టాలపై పడి ఒకరి మృతి

- మృతుడు ఛత్తీస్‌గఢ్‌వాసి
- రామగుండం రైల్వేస్టేషన్‌లో ఘటన


దయాసింగ్ మృతదేహం

రామగుండం: ఉపాధి నిమిత్తం వచ్చి, స్వస్థలానికి వెళ్తున్న ఓ కార్మికుడు ప్రమాదవశాత్తు మృతిచెందిన ఘటన రామగుండం రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి గంగారపు తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బలరాంపూర్ జిల్లా పరిధి శాంతిపూర్‌కు చెందిన దయాసింగ్(32) జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్మితమవుతున్న మెడికల్ కళాశాలలో సెంట్రింగ్ రాడ్ బెండింగ్ కార్మికుడిగా నెల రోజుల క్రితం విధుల్లో చేరాడు. ఈ నేపథ్యంలో అర్ధరాత్రి ఒంటి గంటకు వచ్చే రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో ఇంటికి వెళ్లేందుకు మంగళవారం రాత్రి రామగుండం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. కానీ రైలు ఎక్కలేదా? లేకపోతే అతను గమనించకపోయేసరికి వెళ్లిపోయిందా తెలియరాలేదు. బుధవారం వేకువజామున రెండో ప్లాట్‌ఫాం పైనుంచి ప్రమాదవశాత్తు పడటంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహం పట్టాల మధ్యలో ఉండటంతో పైనుంచి పలు రైళ్లు వెళ్లినప్పటికీ అలాగే ఉంది. మృతుడి వద్ద బ్యాగులో లభ్యమైన సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులు ఛత్తీస్‌గఢ్‌లోని అతని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య ఇరుమతియాసింగ్, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి పేర్కొన్నారు.

కాళ్లు తొలగించారు.. కనికరించండి

- కరోనా సోకి, షుగర్ లెవెల్స్ పెరగడంతో కాళ్ల తొలగింపు
- కుటుంబ పోషణ భారం
- లాక్ సిస్టం ఉన్న కాళ్లు అమర్చేందుకు రూ.6 లక్షలు అవసరం
- ఆపన్నహస్తం కోసం ప్రైవేట్ ఉపాధ్యాయుడి ఎదురుచూపు


మంచానికే పరిమితమైన రాంచందర్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): 18 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో ఉండి, ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఆయన రెండు కాళ్లు కోల్పోయారు.. కుటుంబ పోషణకు, కృత్రిమ కాళ్లు బిగించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.. దాతలు కనికరించి, ఆపన్నహస్తం అందించాలని వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. యైటింక్లయిన్‌కాలనీకి చెందిన పడకంటి రాంచందర్ ఎంఏ తెలుగు చదివారు. ఆయనకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కాలనీలోని షిర్కె బస్టాప్ ఏరియాలో గల శ్రీవాణి పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా, హెచ్ఎంగా 18 ఏళ్లు పని చేశారు. ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పారు. కరోనా సెకండ్ వేవ్ సమయంలో ఆయనకు వైరస్ సోకి, షుగర్ లెవెల్స్ పెరిగాయి. దీంతో రెండు కాళ్లలో రక్తం గడ్డ కట్టడంతో వైద్యులు కాళ్లను తొలగించారు. అప్పటినుంచి మంచానికే పరిమితమయ్యారు. రెండు కాళ్లను మోకాళ్ల పైకి తీసివేయడంతో జైపూర్ ఆర్టిఫిషియల్ కాళ్లు పని చేయవని వైద్యులు తెలిపారు. లాక్ సిస్టం ఉన్న కాళ్లు మాత్రమే అమర్చాలని, వాటిని జర్మనీ లేదా అమెరికా నుంచి తెప్పించాల్సి ఉంటుందని, దాదాపు రూ.6 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పారు. దీనికి తోడు రాంచందర్ పని చేయకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ఆయన నిత్యం మనోవేదనకు గురవుతున్నారు. దాతలు తనను సోదరుడిగా భావించి, ఆర్థికసాయం అందించి, ఆదుకోవాలని కోరుతున్నారు. సాయం చేయాలనుకునేవారు తన ఫోన్ నంబర్ 98493 74562కు గూగుల్ పే, ఫోన్ పే, పేటీయం ద్వారా డబ్బులు పంపించాలని వేడుకుంటున్నారు.

పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ రిమాండ్

కరీంనగర్‌క్రైం: అవినీతి కేసులో ఏసీబీ అధికారులకు పట్టుబడిన పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ నిర్మలను బుధవారం కోర్టులో హాజరుపరిచారు. జడ్జి రిమాండ్ విధించడంతో కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు కొత్తపల్లి మండలంలోని నిర్మల ఇంట్లో అధికారులు సోదాలు చేశారు. రూ.10 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

మహిళను వేధించిన ట్రాన్స్‌కో ఉద్యోగి రిమాండ్

హుజూరాబాద్‌రూరల్: ఓ మహిళను వేధించిన ట్రాన్స్‌కో ఉద్యోగిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన మహిళ గత కొంతకాలంగా హుజూరాబాద్‌లో టైలరింగ్ చేస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన ట్రాన్స్‌కో ఉద్యోగి ఎండీ.షాబుద్దీన్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. షాబుద్దీన్ ఆమెకు మాయమాటలు చెప్పి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. అంతేకాకుండా సదరు మహిళ స్నానం చేస్తుండగా, రాత్రివేళల్లో వీడియోలు, ఫొటోలు తీశాడు. వాటిని సోషల్ మీడియాలో పెడతానని బ్లాక్ మెయిల్ చేసి, ఆమె వద్ద ఉన్న డబ్బులు తీసుకున్నాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. బుధవారం షాబుద్దీన్‌ను అరెస్టు చేసి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. జడ్జి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై రాజన్న తెలిపారు.

ఇళ్ల స్థలాలు సాధించేవరకు పోరాడుతాం


ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

రామగుండం: పారిశ్రామిక ప్రాంతంలో ఇళ్ల స్థలాలు సాధించేవరకు పోరాడుతామని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. రామగుండంలో 6,050 మంది నిరుపేదలు దరఖాస్తు చేసుకున్నారని, వారందరికీ ఇళ్ల స్థలాలివ్వాలన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ఎండీ.జాహెద్‌పాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య మాట్లాడుతూ.. గోదావరిఖని జనగామ మల్కాపూర్ శివారు సర్వే నం.36, 37, 38, 814, ఇందిరమ్మ కాలనీలోని మేడిపల్లి శివారు సర్వే నం.610, 611, 612, పీకే రామయ్య కాలనీ, లింగాపూర్ మేడిపల్లి శివారు సర్వే నం.617లలో ఉన్న ప్రభుత్వ మిగులు భూములను నిరుపేదలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ గత నెల 18 నుంచి భూపోరాటం చేస్తున్నామని తెలిపారు. సర్కారు భూమిలో పేదలు గుడిసెలు వేసుకుంటే అధికారులు కూల్చివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా ప్రతినిధులు వేల్పుల కుమారస్వామి, మహేశ్వరి, ఎం.రామాచారి, లావణ్య, గీట్ల లక్ష్మారెడ్డి, ఉపేందర్, నాగమణి, రమణ తదితరులున్నారు.

నిరుపేదలకు 'డబుల్' ఇళ్లు కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

గోదావరిఖని(రామగుండం): నియోజకవర్గంలో అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని తెలంగాణ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేశ్ డిమాండ్ చేశారు. బుధవారం గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల రామగుండం నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించిన సమయంలో అనేక సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వాటిని డాక్యుమెంట్ రూపంలో ప్రభుత్వానికి నివేదించనున్నట్లు పేర్కొన్నారు. మేయర్ డివిజన్‌లో ప్రధాన కాలువ కల్వర్టు నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని, అంతర్గంలో ఐటీ పార్క్ వెంటనే నిర్మించాలని పేర్కొన్నారు. ముర్మూరు, ఎల్లంపల్లి భూనిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందలేదని, పాలకుర్తి మండలంలోని కుక్కలగూడూర్‌లో బండలవాగు ప్రాజెక్టు నిర్మాణం జరగలేదని తెలిపారు. రైతుబంధు నిజమైన లబ్ధిదారుల అందలేదని ఆరోపించారు. స్థానిక విఠల్‌నగర్‌లోని కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయని అన్నారు. జీడీకే–5 ఓసీపీ వల్ల రాంమందిర్ ఏరియా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. స్థానిక కళాకారుల కోసం నిర్మిస్తున్న భవనం మధ్యలోనే నిలిచిపోయిందన్నారు. నాయకులు ఇరుగురాల సంతోష్, కోహెడ శివరాం, అల్లెపు తిరుపతి, గాజుల రమేశ్, జక్కం కవిత, పొన్నం రజిత తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పోరాడితేనే సమస్యల పరిష్కారం

- కేశోరాం పర్మినెంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్ రెడ్డి


మాట్లాడుతున్న మనోహర్ రెడ్డి

పాలకుర్తి(రామగుండం): కార్మికులు, నాయకులు సమిష్టిగా పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని కేశోరాం సిమెంట్ కర్మాగారం పర్మినెంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్ రెడ్డి అన్నారు. బుధవారం కంపెనీ సూపర్ బజార్‌లోని కార్మిక సంఘం కార్యాలయంలో సంఘం ప్రధాన కార్యదర్శి దాడి మహేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెలలో ఉత్కంఠభరితంగా సాగిన ఎన్నికల్లో తమ ప్యానెల్‌ను ఆదరించి, గెలిపించిన కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 30 మందితో కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పర్శవేని శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా నారాయణ, గుంపుల శంకర్, రాములు, దశరథం, సహాయ కార్యదర్శులుగా పుప్పాల రమేశ్, పుట్ట కొంరయ్య, తప్పట్ల మోహన్, పోతుల ప్రసాద్, కోశాధికారిగా పర్శవేని రాజులు ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేశ్‌లను కార్మికులు సత్కరించారు.

ప్రైవేట్ సెక్యూరిటీగార్డులకు వేతనాలు ఇప్పించండి


ఎస్‌వోటూ జీఎంకు వినతిపత్రం ఇస్తున్న వెంకన్న

రామగిరి(మంథని): సింగరేణి ఆర్జీ–3 పరిధిలో విధులు నిర్వహిస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీగార్డులకు మార్చి నెల వేతనాలు ఇప్పించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్జీ–3 ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతికి వినతిపత్రం అందించారు. నెల రోజులుగా వేతనాలు చెల్లించకపోవడంతో సెక్యూరిటీగార్డులు కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి, వీలైనంత త్వరగా వేతనాలు చెల్లించేలా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో ప్రైవేట్ సెక్యూరిటీగార్డులు ఉడుత శంకర్, గుర్రం చంద్రశేఖర్, తూటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.